# అసెంబ్లీలో నిలదీస్తం

మొదటిపేజీ తరువాయి...

సమావేశాల్లో నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అసెంబ్లీని స్తంభింపజేస్తామని స్పష్టం చేశారు. మోతీలాల్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దీక్ష విరమించాలని అందరి తరపున మోతీలాల్‌కు తాము విజ్ఞప్తి చేశామని, కానీ, లక్షలాదిమంది నిరుద్యోగుల జీవితాల తో ఆడుకుంటున్న ప్రభుత్వం దిగి వచ్చే వరకు తన దీక్ష కొనసాగుతుందని ఆయన తమతో చెప్పారని హరీశ్‌రావు వివరించారు. మోతీలాల్‌కు ఆరోగ్యం క్షీణిస్తున్నదని, ఆయనకు హాని జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వచ్చి మోతీలాల్‌నాయక్‌తో మాట్లాడి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలను ఇస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వరకు నిరుద్యోగుల తరపున బీఆర్ఎస్ పోరాడుతుందని తేల్చిచెప్పారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క బాండ్ పేపర్ రాసిచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక దానిని ఎందుకు విస్మరించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ప్రజాభవన్‌కు వెళ్లి చిన్నా రెడ్డి కాళ్లు పట్టుకోవాల్సిన దుస్థితి ఎందుకొచ్చిందని నిలదీశారు. నిరుద్యోగుల కోసం ఆనాడు ప్రొఫెసర్ కోదండరాం, రియాజ్, బల్మూరి వెంకట్, రేవంత్‌రెడ్డి అశోక్‌నగర్‌లోని కోచింగ్ సెంటర్లకు రాహుల్‌గాంధీని తీసుకొచ్చారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీలు ఇప్పించారని, బస్సు యాత్రలు నిర్వహించారని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైందని, జాబ్ నోటిఫికేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. నిరుద్యోగులను నాడు రెచ్చగొట్టిన ప్రొఫెసర్ కోదండరాం ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బీ లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ముఠా జయసింహ, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌నాయక్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, బక్కా జడ్సన్, సేవాలాల్ సేన అధ్యక్షుడు సంజీవ్‌నాయక్, బంజారా సేవా సంఘం అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్‌నాయక్, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్, నిరుద్యోగ యువకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

గాంధీ దవాఖానలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్వీ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, ప్రొఫెసర్ గాలి వినోద్

### మోతీలాల్‌కు భారీ మద్దతు

నిరుద్యోగుల పక్షాన ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఉస్మానియా విద్యార్థి నేత మోతీలాల్ నాయక్‌కు బీఆర్ఎస్ సహా వివిధ పక్షాలు పెద్ద ఎత్తున మద్దతు ఇస్తున్నాయి. ఆదివారం గాంధీ దవాఖానకు వెళ్లిన ఎమ్మెల్యే హరీశ్‌రావు సహా పలువురు నేతలు మోతీలాల్ నాయక్‌ను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ, యువజన నేతలు, ఓయూ ప్రొఫెసర్లు నిరుద్యోగుల ఉద్యమానికి మద్దతుగా నిలుస్తున్నారు.

### చర్చలు విఫలం

బన్సీలాల్‌పేట్, జూన్ 30: గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకుడు మోతీలాల్‌తో ఆదివారం రాత్రి ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. తాను సీఎంతో మాట్లాడి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పినప్పటికీ మోతీలాల్ ససేమిరా అన్నారు.సీఎం స్పష్టమైన హామీ ఇస్తేనే దీక్ష విరమిస్తానని తెగేసి చెప్పడంతో వెంకట్ వెనుదిరిగారు. నిరుద్యోగులు ప్రధానద్వారం వద్ద బల్మూరిని ఘెరావ్ చేసేందుకు సిద్ధంగా ఉండటంతో పోలీసులు అతనిని వెనుక గేట్ నుంచి మరొక వాహనంలో పంపించారు. మోతీలాల్‌ను కలవడానికి వచ్చిన నేతలు రియాజ్, మానవతారాయ్, చెరగొండ వెంకటేశ్, చనగాని దయాకర్, బాల లక్ష్మి, నిజాన రమేశ్ తదితరులనూ నిరుద్యోగులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు నిరుద్యోగులను శాంతింపజేసి నేతలను లోపలికి పంపించారు. తక్షణమే నిరుద్యోగులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలకు పిలువాలని విద్యార్థి నేతలు డిమాం డ్ చేశారు. సీఎంతో చర్చించడానికి ప్రయత్నిస్తామని నేతలు వారికి హామీ ఇచ్చారు.

## రాహుల్.. 2 లక్షల ఉద్యోగాలేవీ?

- జాబ్ క్యాలెండర్ ఎక్కడ?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ప్రశ్న

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ ఏమైందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు రాహుల్‌గాంధీ స్వయంగా యువతను, నిరుద్యోగులను కలిసి రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను మొదటి ఏడాదిలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని ఎక్స్‌వేదికగా కేటీఆర్ గుర్తుచేశారు. అన్ని ప్రధాన పత్రికల్లో పెద్ద ఎత్తున జాబ్ క్యాలెండర్ పేరుతో ప్రకటనలను సైతం విడుదల చేశారని పేర్కొన్నారు. జాబ్‌క్యాలెండర్, ఉద్యోగాల భర్తీని తేదీలతో సహా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని గుర్తుచేశారు. ఇప్పటికే 7 నెలల సమయం గడిచిపోయిందని, కానీ ఒక్క కొత్త ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ కూడా జారీ కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన 10 నోటిఫికేషన్ తేదీల గడువు ముగిసిపోయిందని పేర్కొన్నారు. మిగిలిన ఐదు నెలల కాలంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఏవిధంగా జారీ చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ తరపున ఎన్నికైన నాయకులు, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో బాధ్యత తీసుకొని స్పందించకపోవడం వల్లనే రాహుల్‌గాంధీని ప్రశ్నిస్తున్నానని తెలిపారు. రాహుల్‌గాంధీ అయినా తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు.

### సీఎస్ శెట్టికి కేటీఆర్ శుభాకాంక్షలు

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) నూతన చైర్మన్‌గా నియామకం కానున్న తెలంగాణ బిడ్డ చల్లా శ్రీనివాసులు శెట్టికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆదివారం ఎక్స్ వేదిక హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం పెద్ద పోతులపాడు సీఎస్ శెట్టి స్వగ్రామం. ఎనిమిది నుంచి ఇంటర్ వరకు గద్వాలలో పూర్తిచేశారు.

## 25 వేల టీచర్ పోస్టులు భర్తీచేయాలి

- ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

ముషీరాబాద్, జూన్ 30: నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 25 వేల టీచర్ పోస్టులను ఒకే దఫాలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు వద్ద ఆదివారం నిరుద్యోగులు చేపట్టిన ధర్నా లో ఆర్ కృష్ణయ్య ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. బీఈడీ చేసిన వారే నాలుగు లక్షల మందికిపైగా ఉంటే స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 2,200 నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని తెలిపారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 4 వేల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నీల వెంకటేశ్, పవన్, సంగేశ్, అనంతయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి : జాజుల

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు సుమారు రూ.5వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉందని, ఆ నిధులను ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ఒక లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో లక్షల మంది విద్యార్థుల ఉన్నత చదువులు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పించాలని, బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం ర్యాంకుతో నిబంధన లేకుండా బీసీ విద్యార్థులకు పూర్తి రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేయాలని కోరారు.

## మాజీ సర్పంచ్‌లకు బిల్లులు ఇవ్వకుంటే ఉద్యమం

- 1,200 కోట్ల బకాయిలు రావాలి
- అప్పులు తెచ్చి పనులు చేసినం
- కట్టలేక కొందరు ఆత్మహత్యలు
- ప్రభుత్వానికి ఎన్నో వినతులు
- స్పందన లేక గవర్నర్‌ను కలిసినం
- సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, ఆ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ లక్ష్మీనరసింహారెడ్డి, సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, నెమలి సుభాశ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు స్పందించడం లేదని శనివారం హైదరాబాద్‌లో గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి వినతి ప్రతం అందజేశారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ 2019-24 లో సర్పంచ్‌లుగా ఉండి గ్రామాల్లో వీధిలైట్ల నిర్వహణ, మురుగు కాలువల నిర్మాణం, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, మనఊరు-మనబడి, పల్లెప్రగతి, మిషన్ భగీరథ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, తెలంగాణ పంచాయతీలను దేశానికే ఆదర్శంగా తీర్చిద్దామని గుర్తుచేశారు. తమ పదవీకాలం ముగిసి ఐదు నెలలు కావస్తున్నా పెండింగ్ బిల్లులు అందక 12,769 పంచాయతీల తాజా మాజీ సర్పంచ్‌లు తీవ్ర ఆర్థికఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బిల్లులు అందక, అప్పులు చెల్లించలేక పలువురు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బిల్లులపై సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, స్పందన రాకపోవడంతో గవర్నర్‌కు వినతిప్రతం ఇచ్చామని తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని గవర్నర్ హామీ ఇవ్వడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరునెలలైనా బిల్లులు ఇవ్వడం లేదని వాపోయారు. పెండింగ్ బిల్లులు తక్షణమే ప్రభుత్వం ఇవ్వకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘాల నేతలు సముద్రాల రమేశ్, ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, రాజేందర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

### 30 లక్షల బకాయి

మా పంచాయతీకే 30 లక్షల బిల్లులు రావాలి. అప్పులు తెచ్చి అభివృద్ధి చేసినం. మా పంచాయతీకి కేంద్ర అవార్డు వచ్చింది. మా పదవీకాలం ముగిసినా బిల్లులు రావడంలేదు.

-లక్ష్మీప్రసాద్‌రెడ్డి, కొలనుపాక
మాజీ సర్పంచ్, భువనగిరి జిల్లా

### నెల ఖర్చు 11 లక్షలు

మాది మేజర్ పంచాయతీ. నిర్వహణకు నెలకు 11 లక్షలు ఖర్చవుతుంది. తొలుత చెక్ పవర్ లేనప్పుడు పంచాయతీ సిబ్బంది వేతనాలను కూడా జేబుల్లోంచి ఇచ్చినం. కొత్త ప్రభుత్వం వచ్చాక బకాయిలు ఇస్తలేదు. నిధులు రాక ప్రత్యేకాధికారులు బల్బు కూడా వేయలేకపోతున్నరు.

-రాజేందర్, ముథోల్
మాజీ సర్పంచ్, నిర్మల్ జిల్లా

### బిల్లులు ఇచ్చే ఎన్నికలకు..

మా బాధలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అర్థంచేసుకోవాలి. పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలి. లేదంటే కొత్త సర్పంచ్‌లతో మాకు ఇబ్బందులు వస్తయ్. బకాయిలు ఇవ్వకుండా ఎన్నికలకు వెళ్తే ఆందోళన చేస్తం.

-నెమలి సుభాశ్, ఇబ్రహీంనగర్
మాజీ సర్పంచ్, సిద్దిపేట జిల్లా

### రూపాయి ఇవ్వలే..

మా పాలనలో అప్పు చేసి అభివృద్ధి పనులు చేసినం. మా పంచాయతీకి రూ.30 లక్షల బిల్లులు రావాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరునెలలవుతున్నా పంచాయతీలకు రూపాయి కూడా ఇవ్వలేదు.

-సముద్రాల రమేశ్, ఖమ్మంపల్లి
మాజీ సర్పంచ్, పెద్దపల్లి జిల్లా

## 7న ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష

- మాదిగలకు కేంద్రం తీరని అన్యాయం
- పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి

ముషీరాబాద్, జూన్ 30: ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రం జాప్యం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 7న ఇందిరాపార్కు వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్టు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా కేంద్రప్రభుత్వం మాదిగలకు తీరని అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిరసన దీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాలుగా బీజేపీ, కాంగ్రెస్‌లు వర్గీకరణ అంశాన్ని తేల్చకుండా మాదిగలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్ని వర్గాల మద్దతు, పలు కమిటీల నివేదికలు వర్గీకరణకు అనుకూలంగా ఉన్నా కేంద్రం పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత వాగ్దానాలను నమ్మి గత మూడు దశాబ్దాలుగా మాదిగలు మోసపోతూనే ఉన్నారని తెలిపారు. ఇటీవల ఎన్నికల సభలో తాను మాదిగల పెద్దన్నను చెప్పిన ప్రధాని మోడీ ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కూడా ఎస్సీ వర్గీకరణ బిల్లుకోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పొట్టపెంజర రమేశ్, చిలకమర్రి గణేశ్, హుస్సేన్, చిన్న స్వామి, సారంగం, శ్రీనివాస్, యాదగిరి, మేడి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### మోతీలాల్‌కు ఏమైనా సర్కారుదే బాధ్యత

- బీఆర్ఎస్వీ నేత తుంగ బాలు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ ప్రాణానికి హాని జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల కోసం ఆయన చేస్తున్న దీక్షతో సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా కండ్లు తెరవాలని స్పష్టం చేశా రు. వారం రోజులుగా దీక్షలో ఉన్న మోతీలాల్ ఆరోగ్య పరిస్థితి రోజురోజు కూ విషమిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతులతో ఏర్పాటైన ఖాళీలను ఆ నోటిఫికేషన్లో కలిపి మెగా డీఎస్సీగా మార్చాలన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో భవిష్యత్తు పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

## ప్రైవేటుకు ఢిల్లీ తెలంగాణ టవర్!

- 24 అంతస్థుల నిర్మాణానికి 500 కోట్ల ఖర్చు
- ప్రైవేటు డెవలపర్‌కు అప్పగింత?
- స్టార్ హోటళ్లతో సంప్రదింపులు

ఢిల్లీలో తెలంగాణ భవన్ మ్యాపును పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి (ఫైల్)

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో కొత్తగా నిర్మించనున్న తెలంగాణ భవన్‌ను 'ప్రైవేటు'కు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. ఢిల్లీలో బహుళ అంతస్థులతో నిర్మించనున్న తెలంగాణ భవన్‌లో వాణిజ్య కార్యకలాపాల ను అనుమతించాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేటు డెవలపర్‌కు అప్పగించాలని భావిస్తున్నట్టు ఉన్నత స్థాయివర్గాల ద్వారా తెలిసింది.రాష్ట్ర అవసరాలకు కావాల్సినన్ని గదులు రాష్ట్రానికి ఇచ్చి మిగిలినదాంట్లో వాణిజ్య కార్యకలాపా లు నిర్వహించుకునేలా అనుమతించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇందులో భా గంగా స్టార్ హోటళ్లతో సంప్రదింపులు జరుపుతున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఇదే జరిగితే ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉండాల్సిన తెలంగాణ భవన్ ఏదో ఒక స్టార్ హోటల్ పేరుతో పిలుచుకునే పరిస్థితి ఏర్పడుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

### తెలంగాణ టవర్‌కు 500 కోట్లు ఖర్చు

ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌ను ఏపీ, తెలంగాణల మధ్య గత మార్చిలో విభజించారు. మొత్తం 19.781 ఎకరాల విస్తీర్ణంలో ఏపీకి 11.536 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు సమకూరాయి. ఈ మొత్తం ఆస్తి విలువ రూ.9,913.505 కోట్లుగా కేంద్ర హోంశాఖ ప్రకటించింది. తెలంగాణకు వచ్చిన వాటాకు వచ్చిన మూడెకరాల్లో శబరి బ్లాక్ ఉండగా, 5.245 ఎకరాల్లో పటౌడీ హౌస్ ఉంది. శబరి బ్లాక్ ఉన్న ప్రాంతంలో గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర క్యాబినెట్ మంత్రులకు విడివిడిగా బ్లాక్‌లు నిర్మించాలని, మిగిలిన 5.245ఎకరాల్లో రాష్ట్ర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు, అధికారులు వెళ్లినప్పుడు ఉండేలా గదులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం ఇక్కడ బహుళ అంతస్థులు నిర్మించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులు రెండు-మూడు నమూనాలను రూపొందించారు. 24 అంతస్థులతో తెలంగాణ టవర్‌ను నిర్మించనున్నట్టు ఇటీవలే రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంటకరెడ్డి ప్రకటించారు. అయితే ఈ భవనాల నిర్మాణానికి దాదాపు రూ. 500 కోట్లకుపైగా ఖర్చవుతుందని అంచనా.

### ప్రైవేట్ డెవలపర్‌కు అప్పగింత?

ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ప్రైవేటు డెవలపర్ ద్వారా తెలంగాణ టవర్‌ను నిర్మించే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. రాష్ట్ర అవసరాలకు ఎల్లప్పుడూ కనీసం 100 గదులను అందుబాటులో ఉంచి మిగిలిన అంతస్థుల్లో గదులను వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకునేలా అనుమతించాలని నిర్ణయించినట్టు సమాచారం. దీని నిర్మాణానికి సంబంధించి రాష్ట్రానికి చెందిన ప్రతినిధులు ఇప్పటికే ఒకటి రెండు స్టార్ హోటళ్ల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపినట్టు తెలిసింది. రాష్ట్ర అవసరాలకు కావాల్సిన గదులు, వాణిజ్యానికి ఉపయోగించుకునే గదులను విడివిడి బ్లాక్‌లలో నిర్మించాలా, లేక మొత్తం ఒకే టవర్‌ను నిర్మించి అందులోనే వేర్వేరు ప్రవేశాలు ఇవ్వాలా అనేది ఇంకా తేలలేదు.

ప్రెస్‌క్లబ్‌లో జ్ఞాపికలతో నమస్తే తెలంగాణ కార్టూనిస్టు మృత్యుంజయ, శంకర్ తదితరులు

## సాంకేతికతతో సృజనాత్మకత తగ్గదు

- కార్టూనిస్టులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి
- నమస్తే తెలంగాణ కార్టూనిస్టు మృత్యుంజయ

ఖైరతాబాద్, జూన్ 30: 'సంప్రదాయ కార్టూనిస్టు ఓ కాగితం మీద బొమ్మగీసి ప్రచురణకు పంపించే వారు.. ఇది గంటల సమయం పట్టేది.. ఇప్పుడు పదిహేను నిమిషాల్లోనే కార్టూన్లు గీయవచ్చు' అని నమస్తే తెలంగాణ కార్టూనిస్టు మృత్యుంజయ అన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ సౌజన్యంతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలుగు కార్టూనిస్ట్స్ మెగా వర్క్‌షాప్‌ను ప్రముఖ కార్టూనిస్టులు హరికృష్ణ, రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మృత్యుంజయ మాట్లాడుతూ ఒకప్పుడు పొలిటికల్ కార్టూన్ పాఠకులకు వెళ్లాలంటే రెండు రోజులు పట్టేదని, నేడు వార్తలతో పాటు ఉత్తమమైన, సృజనాత్మకమైన కార్టూన్లనూ పాఠకులకు అందించవచ్చని అన్నారు. 2018లోనే ఫొటోషాప్‌లో కార్టూన్లు గీయడంపై తాను బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్టూనిస్టు వర్క్‌షాప్‌లో డెమో ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఐప్యాడ్‌లో ప్రొక్రియేట్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని డిజిటల్ కార్టూన్లు వేయవచ్చని చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడం వల్ల వార్తలతో సమానంగా కార్టూన్లు పాఠకులకు చేర్చవచ్చని తెలిపారు. ట్రెడిషనల్ ఆర్ట్‌కు ఓ సెటప్ అవసరమని, కూర్చొని బొమ్మగీస్తారని, ఐప్యాడ్ వచ్చిన తర్వాత ఎక్కడైనా బొమ్మలు గీసి పంపించే వెసులుబాటు కలిగిందని చెప్పారు. కార్టూన్ల విషయంలో సాంకేతికత అనేది ఒక టూల్ టెక్నిక్ మాత్రమేనని, ఇందులో కార్టూనిస్టు సృజనాత్మకత ఏ మాత్రం తగ్గదని పేర్కొన్నారు. టెక్నికల్, ట్రెడిషనల్ ఆర్ట్ మీద 80 మంది ఇంటర్నేషనల్ కార్టూనిస్టులను ఇంటర్వ్యూలు చేసి పుస్తకాన్ని తేచ్చే ప్రయత్నంలో ఉన్నానని తెలిపారు. ఇప్పటికే 40 వ్యాసాలు నమస్తే తెలంగాణలో అచ్చయ్యాయని, మరో 40 వ్యాసాలు రాసి పుస్తకాన్ని తీసుకువస్తానని తెలిపారు. అనంతరం ప్రొక్రియేట్ ద్వారా పొలిటికల్ కార్టూన్స్, అదే పొలిటికల్ కార్టూన్ యానిమేషన్ డెమో ప్రదర్శించారు. దక్కన్ క్రానికల్ కార్టూనిస్టు సుభానీ సోషల్, పొలిటికల్ కార్టూన్ల అంశంపై మాట్లాడారు. కార్టూన్లు వాటర్, పోస్టర్ కలర్స్‌తో షేడింగ్, డెప్త్ చూపించడం ఎలా అంశంపై కార్టూనిస్టు టీవీ, కార్టూన్ సిండికేషన్, ఉపయోగం, పని విధానంపై కార్టూనిస్టు నర్సిం, కార్టూన్‌కు బొమ్మ లేక కాన్సెప్ట్ ముఖ్యమా, సైలెంట్ కార్టూన్ తదితర అంశాలపై కార్టూనిస్టు సురేంద్ర, క్యారికేచర్‌పై సాక్షి కార్టూనిస్టు శంకర్, యూత్ కార్టూన్స్‌పై కార్టూనిస్టు శంకు వివరించారు. అనంతరం ప్రముఖ యోగా ట్రైనర్ ఏ సంగీత అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్టూన్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా యోగాకు సంబంధించిన కార్టూన్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు.

## తెలంగాణ పరిశ్రమలపై ఏపీ నజర్!

- విదేశీ పెట్టుబడులను మళ్లించుకొనే ఎత్తులు
- ఇంకా గ్రౌండ్ కాని క